# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JULY - 2004

## సత్యవాణి - క్రీస్తు సంఘము నిర్వహించు గొప్ప
## బైబిల్ లెక్చర్‌షిప్

**2004 సెప్టెంబరు 21, 22, 23 తేదీలలో**

స్థలం : సత్యవాణి
7-9-35, రామారావ్ పేట,
కాకినాడ - 533 004.

ప్రసంగీకులు : భారత, అమెరికా దేశములలో
ప్రఖ్యాతి గాంచిన గొప్ప బైబిలు
పండితులు.

దూరప్రాంతముల నుండి వచ్చువారికి ఉచిత భోజనం, వసతి కల్పించబడును, మీ పేరును ఈనాటి నుండియే నమోదు చేయించు కొనండి. వివరములకు దిగువ చిరునామాను సంప్రదించండి లేదా ఫోన్ చేయండి.

వందనములతో
బ్రదర్ **జాషువా గూటం**
ఫోన్ : 0884 - 2363722
2363697

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 24 — జూలై 2004 — సంచిక 12


## యేసుక్రీస్తు దేవుని కుమారుడని క్రైస్తవులు ఏల నమ్ముదురు? - 3

(Why Christians believe Jesus Christ as the Son of God)

యేసుక్రీస్తు దేవుని కుమారుడని క్రైస్తవులు ఎందుకు నమ్ముదురో గత కొద్ది సంచికలో తెలిసికొని యున్నాము. మా కార్యక్రమములను విని యేసుక్రీస్తు నందు విశ్వాసాన్ని వెల్లడి పర్చుచూ అనేకులు మాకు వ్రాసారు. వారికి నా హృదయ పూర్వక వందనములు చెల్లించుచున్నాను. ఇంతవరకు యేసును గూర్చి మనము నేర్చు కొనిన కొన్ని సత్యా లను ఇప్పుడు జ్ఞప్తికి తెచ్చుకొందాము.

యేసు కన్యయైన ఒక స్త్రీకి దేవుని వలన కలిగెను. అందువలన ఆయన జన్మించిన రీతిని బట్టి ఆయన దేవుని అద్వితీయ కుమారుడాయెను. ఆయనే దేవుని కుమారుడు అని యేసును ఎరిగిన అనేకులు ఇచ్చిన సాక్ష్యమును బట్టి మనము ఆయన యందు విశ్వాసముంచగలము. అంతేకాదు. యేసు క్రీస్తు యొక్క జనన, జీవన, మరణ, పునరుత్థానములను గూర్చి వందలకొలది సంవత్సరములకు ముందే

చెప్పబడిన ప్రవచనములనేకములు యేసు క్రీస్తులో అక్షరాల నెరవేరెను. గనుక ఆయనే దేవుని కుమారుడు, ఆయనే దేవుడు అని మనము ఒప్పుకొనక తప్పదు.

యేసు దేవుని యొక్క ఏకైక కుమారుడని మనము నమ్ము నిమిత్తము మనకు ఇంకొక ఆధారమున్నది. ఆయన ఈ లోకములో చేసిన అద్భుతములే. అయితే ఆ యద్భుతములలో కొన్నింటిని ఈరోజు మనము పరిశీలించుదాము. భూమిపై ఏ మానవుడు ఎన్నడు చేయలేని అద్భుత కార్యములను యేసు చేసెను. ఆయన చేసిన అద్భుత కార్యములను చూచిన జనసమూహములు ఆయనే దేవుని కుమారుడని ఒప్పుకొనక తప్పలేదు. ఆయన దేవుని కుమారుడుని కానియెడల అట్టి మహత్కార్యముల నెట్లు చేయగలడు? మత్తయి, మార్కు, లూకా, యోహాను అనువారు యేసు చేసిన అద్భుత కార్యములలో కొన్నింటిని క్రొత్త నిబంధన గ్రంథములో మనకు వ్రాసి యిచ్చారు. వారు వ్రాసిన సాక్ష్యమును మనము చదువుచుండగా యేసు చేసిన మహత్కార్యములు, సూచక క్రియలు ఆయనే దేవుని కుమారుడని సూచించుచున్నవి. ఆయన చేసిన అద్భుతములలో 41ని గూర్చి క్రొత్త నిబంధనలోని మొదటి నాలుగు సువార్తలు మనకు తెలియజెప్పుచున్నవి. అయితే "యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని" భక్తుడైన యోహాను సాక్ష్యము పలికెను. (యోహాను 21:25).

యేసుక్రీస్తు గ్రుడ్డివారికి చూపు నిచ్చెను. కుంటివారికి నడుచు శక్తి నిచ్చెను. కుష్టరోగులను శుద్ధులనుగా చేసెను. చెవిటి వారికి వినుటకు శక్తి నిచ్చెను. చనిపోయిన వారిని లేవదీసెను. మనుష్యుల కున్న ప్రతి విధమైన రోగములను మాటచెప్పి బాగు చేసెను. దయ్యములను వెళ్ళగొట్టెను. నీళ్ళమీద నడచెను. గాలిని తుఫానును ఆయన గద్దించగా అవి నిమ్మళ మాయెను. వేలకొలది ప్రజలకు ఆయన అద్భుతరీతిగా ఆహారము నిచ్చెను. ఆయన చనిపోయి సమాధి చేయబడినను మృత్యు వును తనకు తానే గెలిచి లేచెను. అందువలన ఆయన దేవుని కుమారుడని మహిమా ప్రభావముతో నిరూపింపబడెను (రోమా 1:4).

గలిలయలోని కానా యను ఊరిలో ఒక వివాహము జరిగెను. యేసు తల్లి అక్కడ ఉండెను; యేసును, ఆయన శిష్యులును ఆ వివాహమునకు పిలువబడిరి.

ఆ వివాహమందు నీళ్ళను ద్రాక్షారసముగా మార్చి యేసు తన మహిమను బయలు పరచెను. యేసు చేసిన సూచక క్రియలలో ఇది మొదటిది. అందువలన ఆయన శిష్యులు ఆయన యందు విశ్వాస ముంచిరి (యోహాను 2:1-11).

కపెర్నహూము అను ఊరిలో ఒక ప్రధాని కుమారుడు రోగియై యుండెను. యేసు గలిలయకు వచ్చెనని ఆ ప్రధాని విని ఆయన యొద్దకు వెళ్ళి తన కుమారుడు చావ సిద్ధమై యుండెను గనుక ఆయన వచ్చి అతని స్వస్థపరచవలెనని వేడుకొనెను. యేసు నీవు వెళ్ళుము. నీ కుమారుడు బ్రతికి యున్నాడని అతనితో చెప్పగా ఆ మనుష్యుడు యేసు తనతో చెప్పిన మాట నమ్మి వెళ్ళిపోయెను. అతడింక వెళ్ళు చుండగా అతని దాసులు ఎదురుగా వచ్చి అతని కుమారుడు బ్రతికి యున్నాడని తెలియ జెప్పిరి. నీ కుమారుడు బ్రతికి యున్నాడని యేసు తనతో చెప్పిన ఘడియ యందే అది జరిగెనని అతడు కనుగొనెను గనుక అతడును అతని యింటి వారందరును యేసును నమ్మిరి (యోహాను 4:46-54).

ఒకసారి కుష్టరోగి ఒకడు వచ్చి యేసునకు మ్రొక్కి...... ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. అందు కాయన చెయ్యి చాపి వానిని ముట్టి నాకిష్టమే, నీవు శుద్ధుడవు కమ్ము అని చెప్పగా తక్షణమే వాని కుష్టరోగము శుద్ధి యాయెను (మత్తయి 8:2-4). మరియొక సారి యేసు యెరూషలేమునకు ప్రయాణమై పోవుచుండగా పదిమంది కుష్టరోగులు ఆయనకు ఎదురుగావచ్చి దూరమున నిలిచి యేసుప్రభువా, మమ్ము కరుణించుమని కేకలు వేసిరి. ఆయన వారిని చూచి - మీరు వెళ్ళి మిమ్మును యాజకులకు కనుపరచు కొనుడని వారితో చెప్పెను. వారు వెళ్ళు చుండగా శుద్ధులైరి. వారిలో ఒకడు స్వస్థత కలుగుట చూచి గొప్ప శబ్దముతో దేవుని మహిమపరచుచు యేసు పాదముల యొద్ద సాగిలపడి ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెను (లూకా 17:11-19).

యేసు మార్గమున వెళ్ళుచుండగా పుట్టు గ్రుడ్డియైన ఒక మనుష్యుడు కనబడెను. యేసు నేలమీద ఉమ్మివేసి, ఉమ్మితో బురదచేసి, వాని కన్నులమీద ఆ బురద పూసి, నీవు సిలోయము కోనేటికి వెళ్ళి అందులో కడుగుకొనుమని చెప్పెను. వాడు వెళ్ళి కడుగుకొని చూపుగలవాడై వచ్చెను. అతడు చూపుపొంది దేవుని మహిమ పరచెను. యేసు దేవుని యొద్ద నుండి వచ్చినవాడని లోకమునకు నిర్భయ ముగా సాక్ష్యమిచ్చెను (యోహాను 9వ అధ్యా). యేసు యెరికో పట్టణము

వెళ్ళుచుండగా త్రోవ ప్రక్కన కూర్చున్న యిద్దరు గ్రుడ్డివారు ప్రభువా, దావీదు కుమారుడా, మమ్ము కరుణింపుమని కేకలు వేసిరి. కాబట్టి యేసు కనికరపడి వారి కన్నులు ముట్టెను; వెంటనే వారు దృష్టిపొంది ఆయన వెంట వెళ్ళిరి (మత్తయి 20:29-34).

ఒకసారి సమాజ మందిరపు అధికారి యాయీరను నతడు యేసునొద్దకు వచ్చి, నా కుమార్తె యిప్పుడే చనిపోయినది. అయినను నీవు వచ్చి నీచెయ్యి ఆమె మీద ఉంచుము, ఆమె బ్రతుకుననెను. యేసు అతని యింటికి వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకొని చిన్నదానా, లెమ్మని చెప్పగానే ఆ చిన్నది లేచి నడవసాగెను. ఆమె పండ్రెండు సంవత్సరములు ప్రాయము గలది. ఇది చూచి జనసమూహములు బహుగా విస్మయ మొందిరి (మత్తయి 9:18-19, 23-26; మార్కు 4:21-24, 35-42). యేసు నాయీనను ఒక ఊరికి వెళ్ళు చుండగా, ఆ ఊరి గవిని యొద్దకు వచ్చినపుడు చనిపోయిన యొకడు వెలుపలికి మోసికొనిపోబడుచుండెను. ఆయన ఆశవమును నిలిపి చిన్నవాడా లెమ్మని నీతో చెప్పుచున్నాననగా ఆ చనిపోయినవాడు లేచి కూర్చుండి మాటలాడసాగెను. ఇది చూచి అందరు భయాక్రాంతులై దేవుడు తన ప్రజలకు దర్శన మనుగ్రహించి యున్నాడని దేవుని మహిమ పరచిరి (లూకా 7:11-16). యేసు మిత్రుడగు లాజరు అను నతడు బేతనియ యను గ్రామములో చని పోయెను. అతడదివరకే నాలుగు దినములు సమాధిలో యుండెనని యేసు ఎరిగినను యేసు అతని సమాధిపై నున్న రాయిని పొర్లింపజేసి, లాజరూ, బయటకు రమ్మని బిగ్గరగా చెప్పెను. వెంటనే చనిపోయిన లాజరు కాళ్లు, చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి వచ్చెను. ఆయన చేసిన ఈ మహత్కార్యమును చూచిన యూదులలో అనేకులు ఆయన యందు విశ్వాస ముంచిరి (యోహాను 11:1-46).

యేసు తన శిష్యులతో కలసి ఒక దోనెలో ప్రయాణము చేయుచుండెను. ఆయన నిద్రించుచుండగా సముద్రము మీద తుఫాను లేచినందున, ప్రభువా నశించిపోవుచున్నాము, మమ్మును రక్షించుమని చెప్పి శిష్యులు ఆయనను లేపిరి. ఆయన లేచి గాలిని సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను ఆ మనుష్యులు ఆశ్చర్యపడి - ఈయన యెట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి (మత్తయి 8:23-27). యేసు ఒకసారి సముద్రము మీద నడచుచు తన శిష్యులు

ప్రయాణము చేయుచున్న దోనె యొద్దకు వెళ్ళెను (మార్కు 6:48-56).

యేసు ఒకసారి అయిదు రొట్టెలు రెండు చేపలతో అయిదువేల కంటె ఎక్కువ మందికి సంతృప్తిగా ఆహారము పెట్టెను (మార్కు 6:36-44). మరి యొకసారి యేడు రొట్టెలు, కొన్ని చిన్న చేపలతో ఆయన నాలుగు వేలమంది కంటె ఎక్కువ మందికి ఆహారము పెట్టెను (మార్కు 8:1-9).

యేసుక్రీస్తు చేసిన అనేక అద్భుతములను గూర్చి మనము చెప్పుకొన వలెనన్న మన జీవితమంతయును వెచ్చించిన సమయము చాలదు. యేసే క్రీస్తని, ఆయనే దేవుని కుమారుడని మనము నమ్మునట్లు ఆయన ఈ అద్భుత కార్యములను ప్రజల యెదుట చేసెను. ఈనాడు మనము యేసు నందు విశ్వాసముంచవలెనంటే అద్భుతములను చూడనవుసరము లేదు. యేసు చేసిన అద్భుతములను గూర్చి మనము ఆయన గ్రంధమందు చదువుటవలనను, వాటిని గూర్చి వినుటవలనను మనము ఆయన యందు విశ్వాసముంచవలెనని ఆయన కోరుచున్నాడు. అందుకే చూచి నమ్మినవారి కంటె చూడక నమ్మినవారు ధన్యులని ఆయన చెప్పుచున్నాడు (యోహాను 20:29). యేసు చేసిన అద్భుతములు, సూచకక్రియలు, మహత్కార్యములన్నియును బైబిలు నందు వ్రాయబడలేదు. అందులో కొన్ని మాత్రమే వ్రాయబడెను. అందుకే భక్తుడైన యోహాను ఇట్లనుచున్నాడు : "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను............ యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30-31).

ప్రపంచ చరిత్రలో యేసులాంటి మానవుడెన్నడు ఉద్భవించలేదు. ఆయన సత్యమును పల్కెను. సత్యమునే జీవించెను. యేసు తప్ప యెవడు కన్యగర్భమున బుట్టెను? దేవుని కుమారుడు తప్ప యెవడు ప్రవచనములను సంపూర్తిగ నెరవేర్చగలడు? యెవడు చనిపోయిన శవములకు ప్రాణము తిరిగి పోయగలడు? ప్రకృతి కర్తయైన దేవునికి తప్ప ప్రకృతి...... సముద్రము, తుఫాను, నీరు మొదలగునవి మరియెవనికి లోబడును? మాయ మంత్రములతో యేసు ఈ లోకమునకు రాలేదు గాని, ఆయన దేవుడైయుండి సర్వశక్తితో మనమధ్య ఉద్భవించెను. ప్రపంచ చరిత్రను, మానవుల అధోగతిని మార్చినవాడు యేసుక్రీస్తే. ఆయనే దైవ మానవుడు, మానవుల దేవుడు.

నీవు ఆయన యందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది, యేసే దేవుని కుమారుడని నీనోటితో ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల...... ఆయనను బట్టియే నీవు రక్షింపబడుదువని జ్ఞాపకముంచుకొనుము. "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు; కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" అని దైవవేదము ఈరోజు కూడ నిన్ను హెచ్చరించుచున్నది (యోహాను 3:36). గనుక నీవు ఆలస్యము చేయవద్దు.

❋ ❋ ❋ ❋ ✍ - జాషువా గూటం

ఉపమానమాలిక :

# ఇద్దరు కుమారులు

**(Two Sons)**

యేసు ప్రభువు దేవాలయములో బోధించుచుండగా ప్రధాన యాజకులు ప్రజల పెద్దలును ఆయన యొద్దకు వచ్చి – ఏ అధికారము వలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు? ఈ అధికారము ఎవడు నీకిచ్చెనని అడిగారు. అందుకు యేసు, యోహాను బాప్తిస్మము ఎక్కడ నుండి కలిగినది? పరలోకము నుండి కలిగినదా? మనుష్యులనుండి కలిగినదా? యనివారినడిగితే వారు మాకు తెలియదని జవాబిచ్చిరి. అందుకాయన ఏ అధికారము వలన ఈ కార్యములు నేను చేయుచున్నానో అదియు మీకు చెప్పననెను (మత్తయి 21:23-27). ఆ తరువాత వచనాల్లో యేసు వారికొక ఉపమానము నిట్లు బోధించాడు :

"మీ కేమి తోచుచున్నది? ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటివాని యొద్దకు వచ్చి – కుమారుడా నేడు పోయి ద్రాక్ష తోటలో పని చేయుమని చెప్పగా, వాడు పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. అతడు రెండవ వాని యొద్దకు వచ్చి ఆ ప్రకారము చెప్పగా, వడు – అయ్యా పోదుననెను గాని పోలేదు. ఈ యిద్దరిలో ఎవడు తండ్రి యిష్టప్రకారము చేసిన వాడని వారి నడిగెను. అందుకు వారు మొదటివాడే యనిరి" (మత్తయి 21:28-30).

మీ కేమి తోచుచున్నది? యని

యేసు ప్రభువు తాను బోధించుచున్న ప్రజల నడిగేవాడు. అట్లు ప్రశ్నించడంలో ఆయన బోధించు అంశముపై వారు మరింత ఆసక్తి చూపించే వారు. ఈ తండ్రికిగల మొదటి కుమారుడు స్వేచ్ఛా పరుడు, అవిధేయుడు. అతడు పాపులకును, సుంకరులకును, వేశ్యలకును యూదులలో సామాన్య ప్రజలకును గురుతుగా యున్నాడు. రెండవ వాడు వేషధారులైన శాస్త్రులకు పరిసయ్యులకు, యూదుల అధిపతులకు గురుతుగా యున్నాడు. బాప్తిస్మమిచ్చు యోహాను వారిని సర్ప సంతానమన్నాడు (మత్త 3:5-7). ఈ ఉపమానములో తండ్రి - దేవునిని, ద్రాక్ష తోట సంఘమును, ఇద్దరు కుమారులు, ఆనాటి, ఈనాటి సమాజములో యున్న రెండు నైతిక తరగతులవారిని సూచించుచున్నారు : కొందరు బహాటముగా తిరుగుబాటు జీవితాన్ని జీవిస్తారు, మరికొందరు పైకి విధేయులగునట్లు కన్పించి లోపల తిరుగుబాటు జీవితాన్ని జీవించు వేషధారులు.

తండ్రి మొదటి కుమారునితో, కుమారుడా నేడు పోయి ద్రాక్షతోటలో పని చేయుమని చెప్పగా, నేను పోను అని బహాటంగా చెప్పేసాడు. అతనిలో వేషధారణ యేమీలేదు. అతడనుకొన్నా దానిని ఆలోచించకుండా వెంటనే చెప్పేసాడు. అతడు తండ్రి మనస్సును తప్పక గాయపరచి యుంటాడు. తండ్రి అతనికి బదులు యేమీ చెప్పలేదు. తండ్రి చెప్పినది అతడు ఆలకించినను అవిధేయతలో యున్నాడు. యేసు అతని ప్రవర్తనను సమర్ధించలేదు, గాని అతడు మనస్సు మార్చుకొన్నాడు.

మొదటివాడు నేను పోను అని ఉత్తరమిచ్చాడు గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. అట్లు చేయడంలో తన నిష్కాపట్యాన్ని రుజువు చేసాడు. మారు మనస్సును నిజముగా వ్యక్తపరచాడు చేయనని దానిని వెళ్లి చేసాడు. మనకు మంచి పాఠాన్ని బోధించాడు.

అయితే నిర్మొహమాటము వలన ఒకడు రక్షింపబడలేడు. మనం వాగ్దానం చేసినను, చేయకపోయినను ప్రభువుకు సేవ చేయ బాధ్యులమై యున్నాము. దేవుడు మన సృష్టికర్త గనుక ఆయన మన సమయాన్ని సేవను కోరదగినవాడు. దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియై యున్నాము (ఎఫెసీ 2:10). నా పని చేయుము అని దేవుడు మనతో చెబుతుంటే, నేను చేయనని చెబుతామా? శ్రే

మనస్సు మార్చుకొని పోయి పని చేయుదుమా?

ఈ మొదటి కుమారుడొక మంచి లక్షణాన్ని కనబరచాడు. అతడు పిమ్మట మనస్సు మార్చుకొని పోయి పని చేసాడు. అతడు మనస్సు మార్చుకొన్నాడు. మారు మనస్సు పొందాడు. క్రియా జనకమైన మారు మనస్సు ఇక్కడున్నది. పాపము చేయు ప్రతివాడును దేవునిపై తిరుగుబాటు చేయుచున్నాడు. అయినను అతడు మనస్సు మార్చుకొని పాపముపై తిరుగుబాటు చేయాలి. మారుమనస్సులో రెండు విధము లైన సంగతులున్నవి. మొదటిది - పాప మార్గమున ప్రయాణించు చున్నవాడు పాపమును విసర్జించుటకు, ద్వేషించుటకు నిశ్చయించుకొనాలి. రెండవది - దేవుని వైపు తిరిగి దేవుని పనిచేయాలి. యిది నిజమైన మారుమనస్సు.

ఈ తండ్రి యొక్క మొదటి కుమారుడు నేను పోను అన్నాడు గాని, మారు మనస్సు పొంది పోయి పని చేసాడు. నేనిప్పుడు నాయిష్టప్రకారం జీవిస్తానుగాని తరువాత ఎప్పుడో మారుమనస్సు పొందుతా ననుకోకూడదు. "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆపంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి క్షయమను పంటను కోయును, ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్యజీవమును పంట కోయును" అని దైవగ్రంధము చెప్పుచున్నది (గలతీ 6:7, 8). ఒకడు మారుమనస్సు పొంది నప్పుడు తన యిష్టము వచ్చినట్లు గాక, దేవుని చిత్తప్రకారము జీవించును. ప్రవర్తించును.

తండ్రి రెండవ కుమారుని యొద్దకు వచ్చి నీవు పోయి నేడు ద్రాక్షతోటలో పని చేయుమని చెప్పగా, వాడు అయ్యా పోదున నెనుగాని పోలేదు. యితడు తియ్యని మాటలు చెప్పి తండ్రిని సంతోషపెట్టాలను కొన్నాడు, నేను పోదునని చెప్పాడు గాని నిజానికి అతడు వెళ్లదలచుకోలేదు, వెళ్ల లేదు. ఇతడు కేవలం వేషధారియే. అనేకులు దేవుని చిత్తాన్ని జరిగించు చున్నట్లు కబుర్లు అడతారు గాని, నిజానికి దేవుని చిత్తాన్ని చేయరు. మీవూరిలోవున్న క్రైస్తవ సంఘాలను, వాటి లోపల యున్న పరిస్థితిని చూడండి. కేవలం వేషధారులతో నేటి క్రైస్తవ సమాజం నిండిపోయింది. క్రీస్తుకాలము నాటి యూదుల సమాజం కూడా అంతే. వేషధారులైన శాస్త్రులు పరిసయ్యులతో నిండిపోయింది. వారు మారుమనస్సు పొందుట అవసరం. నేటి వేషధారులు కూడ మారుమనస్సు పొందుట అత్యవసరం.

అందువలననే ప్రభువు ఈ ఉపమానాన్ని చేసాడు.

క్రైస్తవులమని చెప్పుకొనేవారు నోటి మాటలతో కాదు క్రియలతో దేవుని ఘన పరచాలి. "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘన పరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారని" ప్రభువు చెప్పుచున్నాడు (మత్తయి 15:7-9).

యేసు ప్రభువు నందు విశ్వాసముంచుము. ఆయన వాక్యమును బట్టి నిజమైన మారుమనస్సు పొందుము. క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము. దేవుని ద్రాక్ష తోటలో నేడే పనిచేయుట కారంభించుము.

✍ - జాషువా గూటం

❄ ❄ ❄ ❄

# ఆత్మల పరీక్ష

**(A Test of Spirits)**

మొదటి శతాబ్దపు సంఘములో అద్భుత వరములున్న సమయంలో కొందరు అబద్ధ బోధకులు వారికిని అట్టి వరములున్నాయని చెప్పుకొనే వారు. ఈ రోజు కూడా ఆ వరములు కలిగి యున్నామని చెప్పుకొనువారును యున్నారు. 1 యోహాను 4:1లో దేవుడిట్లు చెప్పారు: "ప్రియులారా అనేకమైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లి యున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి".

అబద్ధ బోధకులను పరీక్షించుటకు పరిశుద్ధాత్ముడు మొదటి శతాబ్దములో అనుమతి నిచ్చిన యెడల, 21వ శతాబ్దములో కూడ అద్భుత వరములు కలిగి యున్నామని చెప్పుకొను వారికి కూడ ఆ పరీక్షయే వర్తించును. ఆ పరీక్షను బట్టి ఆ బోధకుడు సత్యము చెప్పుచున్నాడో లేద మనకు తెలియును.

పౌలు యొక్క అపొస్తలత్వమున కొందరు ప్రశ్నించినప్పుడు, "ప్రభువు నందు నా అపొస్తలత్వమునకు ముద్రగా ఉన్నవారు మీరేకారా?" అని అతడు కొరింథీయులతో

సంఘమునకు తెలియజేసెను (1 కొరింధీ 9:2). క్రైస్తవుల తల మీద చేతులుంచి అద్భుత వరములు వారు పొందుగల్గునట్లు చేయగల శక్తి అపొస్తలులకు మాత్రమే యుండెను (అపొ.కా. 8:17, 18). పౌలు కొరింధులో సువార్త ప్రకటించెను గనుక వారిలో కొందరు ఆ వరములను అతని నుండి పొంది యుండిరి (అపొ.కా. 18:1). వారికి అట్టి వరము లుండినందున అతడు యేసు క్రీస్తు యొక్క అపొస్తలుడని వారికి నిరూపించబడెను.

తమకు లేకపోయినా సరే కొందరు అద్భుత వరములు కలిగి యున్నామని చెప్పుకొనుచున్నారని పౌలుకు తెలియును. యిట్టి వరములు కలిగి యున్నామని చెప్పుకొనువారు సత్యమును చెబుతున్నారో లేదో తెలిసికొనుటకు పరిశుద్ధాత్ముడు అతనికి ఒక పరీక్ష నిచ్చెను. గనుక అతడిట్లు చెప్పెను : "ప్రభువు చిత్తమైతే త్వరలోనే మీ యొద్దకు వచ్చి ఉప్పొంగు చున్న వారి మాటలను కాదు వారి శక్తినే తెలిసికొం దును, దేవుని రాజ్యము మాటలతోకాదు, శక్తి తోనే యున్నది" (1 కొరింధీ 4:19, 20).

ఒకడు తన కిష్టమొచ్చిన సంగతులు ఆరోపించుకొన వచ్చును. అయితే అట్టి ఆరోపణలు అద్భుతములు కావు. అద్భుత వరములు నేడు కలిగి యున్నామని చెప్పు కొనువారు పౌలు యొక్క పరీక్ష నెదుర్కొనుటకు నిరాకరింతురు. తాము అద్భుతము చేసి చూపించుటకు బదులు తమకు అద్భుత వరములున్నవని చెప్పుకొనుటతోనే వారు తమ సమయాన్ని వెల్ల బుచ్చు దురు.

ఒకనికి అట్టి శక్తి యుంటే దాన్ని నిరూపిస్తాడని పౌలు చెప్పాడు. అతడు అబద్ధికుడైతే యేమీ చేయలేడు. నేను వ్యక్తిగతంగా యిట్టి అనేక బోధకులను సవాలు చేసాను. అలా సవాలు చేసి నందుకు నన్ను నిందించుట తప్ప వారిలో ఎవడును పౌలు గారి పరీక్షకు తల వొగ్గ లేదు. పరిశుద్ధాత్ముడే ఆ పరీక్ష నిచ్చాడు, గాని వారిలో అందరు దానిలో ఫెయిల్ అయ్యారు, ఓడిపోయారు.

ఎవడైనా తాను పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందానని అద్భుత కార్యములు చేయగలనని చెప్పుకొనుచున్న యెడల అట్టివాడు తన ఆరోపణలను సూచక క్రియచేసి నిర్ధారించాలని మీరు తప్పక కోరండి. ఎట్టి సూచక క్రియలు? "నమ్మిన వారి వలన ఈ సూచక క్రియలు కన బడును; ఏమనగా నా నామమున దయ్యములను వెళ్లగొట్టుదురు; క్రొత్త భాషలు మాటలాడుదురు, పాములను ఎత్తిపట్టు కొందురు. మరణకరమైన దేది త్రాగినను

అది వారికి హాని చేయదు, రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురు" అని యేసు వారితో చెప్పెను. "ఈలాగు ప్రభువైన యేసు వారితో మాటలాడిన తరువాత పరలోకమునకు చేర్చుకొనబడి దేవుని కుడి పార్శ్వమున ఆశీనుడయ్యెను. వారు బయలు దేరి వాక్యమంతటా ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెనువెంట జరుగుచు వచ్చిన సూచక క్రియల వలన వాక్యమును స్థిరపరచు చుండెను: ఆమేన్" (మార్కు 16:17-20).

అద్భుత వరములున్నాయని చెప్పుకొనే వారిలో ఈ సూచనలు కనబడని యెడల దేవుడతనితో లేడని యర్థము. అట్టి శక్తిలేని యెడల అతడు అబద్ధ బోధకుడే. ఈ రకమైన బోధకులు ఎన్నడు ఒక త్రాచుపామును పట్టుకొనరు. వారిలో ఎవడు విషాన్ని యిచ్చినా త్రాగడు. అనేకులను పరీక్షించాను గాని వారిలో ఎవడు వీటి జోలికి పోలేదు. సరిగదా నాతో కలిసి నిజంగా రోగియైన వానిని స్వస్థ పరచు నిమిత్తం ఆసుపత్రికి రమ్మంటే ఒక్కడు కూడారాడు. వారిలో ఏ ఒక్కడు తాను నేర్చుకోలేని వేరొక భాషను మాట్లాడ లేడు.

పరిశుద్ధాత్ముని పరీక్షను ఎదుర్కొనుటకు ఈ బోధకులు నిరాకరించి నందున వారు అబద్ధ బోధకులని రుజువగు చున్నది. మార్కు 16:17-18లో యున్న సూచనలు వారిలో కనబడనందున దేవుడు వారితో లేడని రుజువగు చున్నది. ఏలయనగా తన నిజ సేవకునితో దేవుడు ఎల్లప్పుడు యుంటారు. అద్భుత శక్తి, వరములు కలిగి యున్నానని చెప్పుకొనువాడు, వాటిని కనబరచుట ద్వారా నిరూపించుకొనుటకు ప్రయత్నించును, ఇష్టపడును.

- రేహాక్.

❋ ❋ ❋ ❋

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి. కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు మాటి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు తేజ ఛానల్‌లోను చూడండి.

# ఆరాధనలో వాద్యసంగీతము దేవుని వలన కలిగెనా? లేక మానవుని వలన కలిగెనా?

**(Instrumental misicn worship from God or Man ?)**

ఈ ప్రశ్నకు జవాబును కనుగొను విధానము ఒకే ఒక్కటి యున్నది: క్రొత్త నిబంధన యొద్దకు వెళ్లి మొదటి శతాబ్దపు క్రీస్తు సంఘారాధనలో వాద్య సంగీతము ఉండెనో లేదో తెలసికొంటే సరిపోతుంది. మన ప్రశ్నకు జవాబుగా క్రొత్త నిబంధనలో కనీసము పది లేఖన భాగములున్నవి.

ఈ లేఖన భాగములను ప్రతి దానిని జాగ్రత్తగా గమనించుదము :

1. "అంతట వారు కీర్తన పాడి ఒలీవల కొండకు వెళ్లిరి" (మత్తయి 26:30).

2. మార్కు 14:26లో కూడ యివే మాటలు వ్రాయబడినవి.

3. "అయితే మధ్యరాత్రివేళ పౌలును సీలయు దేవునికి ప్రార్థించుచు కీర్తనలు పాడుచుండిరి; ఖయిదీలు వినుచుండిరి" (అపొ.కా. 16:25).

4. "ఈ హేతువు చేతను అన్యజనులలో నిన్ను స్తుతింతును; నీ నామ సంకీర్తనము చేయుదును" (రోమా 15:9).

5. "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును, ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును" (1 కొరింథీ 14:15).

6. "ఒకని నొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి" (ఎఫెసీ 5:19).

7. "సంగీతములతోను కీర్తనలతోను ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు బుద్ధి చెప్పుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప నియ్యుడి" (కొలస్స 3:16).

8. ఈ హేతువు చేతను....నీ నామమును నా సహోదరులకు ప్రచుర పరతును సమాజము మధ్య నీ కీర్తిని గానము చేతును" (హెబ్రీ 2:12).

9. "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15).

10. "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్ధన చేయవలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను" (యాకోబు 5:13).

ఈ వచనములను చదివిన తరువాత మంచి మనసు గల ప్రతివాడు క్రొత్త నిబంధనలో పాటలు పాడుటను (గాత్ర సంగీతమును) గూర్చి మాత్రమే మనం చదువ గలమని అంగీకరించును. సంఘారాధనలో పియనో గాని, డ్రమ్ము, కంజిరి మొదలగు వాద్యములను గూర్చిన లేఖన భాగములు ఎక్కడా మనకు కనబడవు. దీనికి కారణం చాల సూక్ష్మం; క్రీస్తు సంఘములు ఆరాధనలో ఎన్నడు వాద్యములు ఉపయోగించలేదు! ఆదిమ క్రైస్తవులు కేవలం పాటలు పాడిరి. అందు వలన క్రైస్తవారాధనలో వాద్యసంగీతము దేవుని వలన గాక మానవుని వలన మాత్రమే కలిగెనని మనము గ్రహించుకొనగలము. నిజానికి క్రీస్తు సంఘము స్థాపించబడిన కొన్ని వందల సంవత్సరముల తరువాతే క్రైస్తవారాధనలోనికి వాద్యములు చేర్పించ బడినవి. క్రీస్తు శకము 670వ సంవత్సరములో మొట్ట మొదటి 'ఆర్గన్' అను వాద్యము ఆరాధనలో ప్రవేశపెట్ట బడెను. పోప్‌వైటాలియన్ అనునతడు దీనిని ప్రవేశపెట్టగా రోమన్ కేథలిక్ సంఘములో చీలిక లేర్పడెను. అందువలన వెంటనే అది నిర్మూలించబడెను. అయితే క్రీస్తు వచ్చిన 800 సంవత్సరముల తరువాత 'ఆర్గన్' అను వాద్యము రోమన్ కేథలిక్కుల గుడులలో కొంత ప్రతిఘటనతోనే మరల ప్రవేశపెట్టబడెను. తత్ఫలితముగా ఉద్భవించిన గ్రీక్ ఆర్థోడాక్స్ సంఘము నేటికిని వాద్యములు వినియోగించరు.

యేసుక్రీస్తు స్థాపించిన సంఘములో వాద్యములు ఎన్నడు వినియోగింపబడలేదని మనం ఇట్టే తెలిసికొన గలము. క్రొత్త నిబంధన దానికి అనుమతి నియ్యలేదు. క్రీస్తు వచ్చిన అనేక వందల సంవత్సరముల తర్వాతనే వాద్యములు ప్రవేశపెట్టబడెనని ప్రపంచ చరిత్రకూడ చెప్పుచున్నది.

ఆరాధనలో వాద్యసంగీతమును ప్రోత్సహించువారు తరుచు ఒక వాదన చేస్తారు. ఈ వ్యాసాన్ని ముగించకముందు దాన్ని పరిశీలించగోర్తాను. "పాతనిబంధన కాలంలో వాద్యములు వినియోగించారు కదా?" యని తరుచు వారు వాదిస్తారు. అవును తప్పక వారు వినియోగించారు అని జవాబిస్తాను. ఉదాహరణకు 150వ కీర్తనలో దేవుని స్తుతించుటకుగాను అనేక వాద్యములు అక్కడ చెప్పబడి యున్నవి. అయితే పాతనిబంధనలో చెప్పబడినంత మాత్రాన వాటిని క్రొత్త నిబంధన ఆరాధన లోనికి

తేవాలని ఎక్కడాలేదు. మీరు పశు బలులను, సాంబ్రాణి పొగలు, పశుబలులు పాత నిబంధన ఆరాధన లోనివి గదా?" యని వారు తిరిగి జవాబిస్తారు. వారి జవాబు ఖచ్చితంగా కరక్టే. ఏలయనగా మనం మోషే ధర్మశాస్త్ర కాలములో జీవించుట లేదు (రోమా 7:4-7; 2 కొరింధీ 3:7-11; కొలస్స 2:14). నేడు ఆరాధనలో మనం యేమి చేసినా అది క్రీస్తు చట్టమగు క్రొత్త నిబంధనలో కనబడాలి. క్రైస్తవారాధనలో పశుబలులకు, సాంబ్రాణి పొగలకు దేవుని గ్రంధములో ఎంత అనుమతి యున్నదో వాద్యములకు కూడా అంతే యున్నది.

మొదటి శతాబ్దపు సంఘములో వాద్యములు కనబడవు. క్రైస్తవులు పాటలు పాడాలని ఆజ్ఞాపింపబడ్డారు. దేవుని మార్గముతోనే మనం సంతృప్తి జెందాలి. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని" యేసు చెప్పెను (యోహాను 4:24).

✍ - కెన్ టైలర్

❋ ❋ ❋ ❋

## శరీరానుసారమైన మనస్సు - ఆత్మాను సారమైన మనస్సు

శరీరానుసారమైన మనస్సు మరణము ఆత్మాను సారమైన మనస్సు జీవమును సమాధానమునై యున్నది *(రోమా 8:6)*.

పై వాక్యభాగములోని

1) శరీరానుసారమైన మనస్సును గూర్చి 2) ఆత్మాను సారమైన మనస్సును గూర్చి క్రీస్తు యేసు రక్తము వలనైన ఆయన మధ్యవర్తియునైన క్రొత్త నిబంధన యొక్క వెలుగులో పరిశీలించి తెలిసికొందము.

శరీరానుసారమైన మనస్సు మరణము : ఏలయనగా శరీరాను సారమైన మనస్సు దేవునికి విరోధమై యున్నది. అది దేవుని ధర్మశాస్త్ర మునకు లోబడదు, ఏమాత్రమును లోబడ నేరదు. కాగా శరీర స్వభావము గల వారు దేవుని సంతోష పరచనేరరు (రోమా8:7,8) శరీరాను సారులు శరీర విషయముల మీద మనస్సునుంచుదురు (రోమా 8:5). కాబట్టి సహోదరులారా శరీరాను సారముగా ప్రవర్తించుటకు మనము శరీరమునకు ఋణస్థులము కాము (రోమా 8:12). మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసిన వారై యుందురు (రోమా 8:13).

కాబట్టి శరీర దురాశలకు లోబడు నట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనీయకుడి. మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి (రోమా 6:12, 13). మీలో అసూయయు కలహమును వుండగా మీరు శరీర సంబంధులైన మనుష్య రీతిగా నడచుకొను వారు కారా? (1 కొరి 3:3). శరీర కార్యములు స్పష్టమై యున్నవి. అవేవనగా జారత్వము, అపవిత్రత కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు కలహములు మత్సరములు, క్రోధములు కక్షలు భేదములు విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. వీటిని గూర్చి నేను ఇది వరకు చెప్పిన ప్రకారము యిట్టి వాటిని చేయు వారు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను (గలతీ 5:19, 20, 21).

మరియు నేను పౌలు వాడను, మరియొకడు నేను అపొల్లోవాడను అని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధులైన మనుష్యులు కారా? (1 కొరింధి 3:3, 4). మీలో ఒకడు నేను పౌలు వాడను, ఒకడు నేను అపొల్లోవాడను, మరియొకడు నేను కేఫా వాడను, యింకొకడు నేను క్రీస్తు వాడనని చెప్పుకొనుచున్నాడని నా తాత్పర్యము. క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తీస్మము పొందితిరా? (1 కొరింధి 1:12, 14). ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు. అవి అతనికి వెఱ్ఱి తనముగా నున్నవి. అవి ఆత్మానుభవము చేతనే వివేచింప దగును గనుక అతడు వాటిని గ్రహింప గలడు (1 కొరింధి 2:14). మీరు వాటిని చేయును. వాయు మండల సంబంధమైన అధిపతిని అనగా అవిధేయులైన వారిని యిప్పుడు ప్రేరేపించు శక్తికి అధి పతిని అనుసరించి యీ ప్రపంచ ధర్మము చొప్పున మునుపు నడుచు కొంటిరి. వారితో కలసి మనమందరమును శరీరము యొక్కయు, మనస్సు యొక్కయు కోరికలను నెరవేర్చు కొనుచు మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు కడమ వారివలెనే స్వభావ సిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమై యుంటిమి (ఎఫెసీ 2:2-3). యిందును బట్టియే అపోస్తలుడైన పేతురు అపొ.కా. 4:12లో మరి యెవని వలనను రక్షణ కలుగదు ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో యియ్యబడిన మరియే

నామమున రక్షణ పొందవలేమనెను నేను. రక్షణ పొందుట అనగా పాపక్షమాపణ పొందుట (అపొ.కా. 2:38). విమోచనము కలుగుట (కొల 1:14). నీవు తడవు చేయుట ఎందుకు? ఆయన నామమును బట్టి ప్రార్ధన చేసి బాప్తిస్మము పొందినీ పాపములు కడిగివేసి కొనుమని చెప్పెను (అపొ.కా. 22:16).

తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదు వనెను మత్త 1:21 మరునాడు యోహాను యేసు తన యొద్దకు రాగా ఇదిగో లోక పాపమును మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల పైన చెప్పబడిన ప్రవచనములను బట్టి యేసు క్రీస్తు సువార్తకు విధేయత చూపుట ద్వారానే రక్షణ పొందగలమని తెలిసి కొనగలుగుచున్నాము. గాని ఆకాశము క్రింద మనుష్యులలో మనుష్యుల ద్వారా, ముందుగా ప్రవక్తల ద్వారా దేవదూతల ద్వారా పలుకబడిన ప్రవచనములకు వ్యతిరేఖముగా నెలకొల్పబడిన మానవ కల్పిత సంఘములలో గాలి గుంపులలో గాని రక్షణ లేదని పాపక్షమాపణ పొంది విమోచింపబడ లేమనియు, ఋజువగుచున్నది.

ఆత్మాను సారమైన మనస్సు జీవమును సమాధానమునై యున్నది (రోమా 8:6). ఆత్మానుసారులు ఆత్మ విషయముల మీద మనస్సునుంతురు (రోమా 8:5). కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింవక, ఉత్తమ మును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసి కొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుట వలన రూపాంతరము పొందుడి (రోమా 12:1, 2).

దేవుని ఆత్మ మీలో నివసించి యున్న యెడల మీరు ఆత్మ స్వరూపము గలవారే గాని శరీర స్వభావము గల వారు కారు ఎవడైనను క్రీస్తు ఆత్మ లేని వాడైతే వాడు ఆయన వాడుకాడు క్రీస్తు మీలో నున్న యెడల మీ శరీరము పాపము విషయమై మృతుమైనది. గాని మీ ఆత్మ నీతి విషయమై జీవము కలిగి యున్నది (రోమా 8:9, 10). దేవుని ఆత్మ చేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు.

అయితే ఆత్మ పూర్ణులై యుండుడి. ఒకని నొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను

హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుచు, మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, క్రీస్తునందలి భయముతో ఒకని కొకడు లోబడి యుండుడి (ఎఫెసీ 5:19, 20, 21). కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము. ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి అట్టి యాగములు దేవునికిష్టమైనవి (హెబ్రీ 13: 15, 16). కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సు తోను ప్రార్థన చేతును; ఆత్మతో పాడుదును మనస్సుతోను పాడుదును (1కొరింథి 14: 15, 16).

పై వాక్యభాగములను బట్టి 1 తిమో 2:4లో చెప్పిన రీతిగా ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చి అనుభవ జ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు (1తిమోతి 2:4).

క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయములలో ఏలుచుండ నియ్యుడి; ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువబడితిరి; మరియు కృతజ్ఞులై యుండుడి. సంగీతములతోను కీర్తనలతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధి చెప్పుచు కృపా సహితముగా మీ హృదయములలో దేవునిని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింప నియ్యుడి. మరియు మాటచేత గాని క్రియ చేత గాని, మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి (కొలస్స 3:15, 16, 17).

గనుక ప్రతి ఒక్కరు ఆత్మానుసారమైన మనస్సు కలిగి ఆత్మీయ జీవితములో ఎదుగ వలసిన అవసరత ఎంతో వున్నట్లు తెలిసికొనగలుగు యున్నాము. ఆత్మ పూర్ణులగాటకు సత్యారాధనలో పాల్గొని ఒకనినొకడు కీర్తనల తోను సంగీతములతో ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరిక చేయుటకు స్వరములెత్తి పాడుట ద్వారానే ఒకరి ఒకడు హెచ్చరిక చేయుట జరుగు చున్నట్లు గమనించ గలము. ఆలాగు చేయుట ద్వారా హృదయములలో ప్రభువును గూర్చి పాడుటకును, కీర్తించుటకును మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట సమస్తమును తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించును. క్రీస్తునందలి భయముతో ఒకనికి ఒకడు లోబడి

వుండుట జరుగుచున్నది ఆలాగు అద్వితీయునికి స్తుతి వందనములు చేయుట జిహ్వాఫలము అర్పించుటకు జరగుచూ ఆత్మతో పాడుచూ మనస్సుతోను పాడుచూ ఆత్మపూర్ణులై ఆత్మయే జీవితములో ఎదుగుటకు ఆత్మాను సారమైన మనస్సు జీవమును సమాధానము యున్నది ఆలాగున నిత్య జీవమునకు వారసులము కాగలము తెలిసికొన గలుగుచున్నాము.

✍ - తోటకూర ప్రకాశరావు

❋ ❋ ❋ ❋

# మన సహోదరు లెవరు?

**(Who Composes the Brotherhood ?)**

"సహోదరులను ప్రేమించుడి" యని అపొస్తలులు క్రైస్తవులను హెచ్చరించి యున్నారు (1 పేతురు 2:17). మనం సహోదరులను ప్రేమించిన యెడల దేవుని యెదుట మన జీవితం యదార్ధముగా యున్నదనే గ్రహించు కొనవచ్చును: "మనము సహోదరులను ప్రేమించు చున్నాము గనుక మరణములో నుండి జీవము లోనికి దాటి యున్నామని యెరుగుదుము" (1 యోహాను 3:14). నిజముగా క్రీస్తులోనికి మారినవాడు దేవుని పూర్ణ మనస్సుతో ప్రేమించు హృదయమును (1 యోహాను 4:19; మత్తయి 22:37), సహోదరులను నిష్కపటముగా ప్రేమించు హృదయమును సహజముగా కలిగి యుండును (1 పేతురు 1:22; రోమా 12:10).

అయితే మన ఆత్మీయ సహోదరులెవరు? అనే ప్రశ్న మనకు ఉద్భవించును. ఎవరిని క్రీస్తునందు సహోదరులని భావించవచ్చును? మన ఆత్మీయ సోదర సోదరీలు ఎవరో క్రీస్తు వారి హెచ్చరికలను బట్టి మనం నిర్ణయించుకొనుట సమంజసమేగదా. దీన్ని బట్టి ప్రతివారు మన ఆత్మీయ సహోదరులు కాజాలరను నది స్పష్టము. అవిశ్వాసులు ఖచ్చితంగా మన సహోదరులు కాజాలరు. నమ్మనొల్లని వారు శిక్షించ బడుదురని యేసు చెప్పెను. యోహాను 3:18; 8:24; మార్కు 16:16 చదువుము. నిర్దేవులు, నాస్తికులు, క్రీస్తును దేవుని కుమారునిగా అంగీకరించని మతముల వారు మొదలగు వారిని గూర్చి ఆలోచించుము. యూదులు, హిందువులు, బౌద్ధులు, ముస్లిములు మొదలగు వారు యేసు నందు విశ్వాసముంచరు. అట్టివారు క్రీస్తు సంఘస్థులకు ఆత్మీయముగా సహోదరులని భావింపబడే అవకాశము లేనేలేదు.

అంతేకాకుండ వారి అజ్ఞానము వలన, అవివేకము వలన, తిరుగుబాటు స్వభావము వలన యేసు యొక్క అధికారమునకు లోబడని వారిని కూడ మనం ఆత్మీయ సహోదరులని ఎంచలేము. యేసు ప్రభువు చెప్పిన మాటలను గమనించుము: "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతి వాడును పరలోకములో ప్రవేశింపబడు గాని పరలోక మందున్న నా తండ్రి చిత్తము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21).

మరల ఈ వ్యాసములో మనం ఆలోచించుచున్న అంశమును గూర్చియే ఆయన ఇట్లన్నారు: "పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియు" అని ఆయన చెప్పెను (మత్తయి 12:50). పరలోకమందున్న తండ్రి తన చిత్తాన్ని బయలు పరచి మనకు తెలియ జేసారు. ప్రతి లేఖనము దైవావేశము వలననే కలిగెను (2 తిమో 3:16). మరియు మనం తన కుమారుని మాటలను వినవలెనని తండ్రి చిత్తమై యున్నది (మత్తయి 17:5; హెబ్రీ 1:1, 2). ఆయన కుమారునికి సమాస్తాధికారము యిచ్చియున్నారు (మత్తయి 28:18; ఎఫెసీ 1:22, 23). ఆయన తనకు విధేయులైన వారందరినీ రక్షించును (హెబ్రీ 5:9-10). మానవ కల్పిత పద్ధతులను బట్టి ఆయన నారాధించు వారు చేసేదంతా వ్యర్థమే యని మత్తయి 15:9లో ఆయనే చెప్పెను. "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు? అని ఆయన అడిగెను (లూకా 6:46).

చివరిగా, క్రీస్తులో నిజమైన సహోదరులెవరనగా, యేసు ఒక్కడే అద్వితీయ దేవుని కుమారుడని విశ్వసించి, ఆయనే తమ రక్షకుడని ప్రేమించి ఆయన సువార్తకు లోబడి, ఆయనకు నమ్మకముగా జీవించువారు. వారు ఆయన ఆత్మీయ శరీరమైన సంఘసభ్యులు, దేవుని పిల్లలు, పరలోక రాజ్య పౌరులు వారు క్రైస్తవులు. వారు ప్రేమిస్తారు. దయగలవారు, జాలిగల వారు, క్షమించువారు, పరిచర్య చేయువారు, అసత్యాన్ని ఎదుర్కొనుచు సత్యము కొరకు ధైర్యముగా నిలుచు వారు. ఆయన వెలుగులో యున్న ప్రకారము వారును వెలుగులో నడుతురు (1 యోహాను 1:7). మరియు ఆయన వాక్యప్రకారము అన్నీ జరిగించడానికి శాయశక్తులా కృషి చేయువారు: వారే మన సహోదరులు !

✍ - మేక్స్ బోరెన్

❄ ❄ ❄ ❄

# క్రైస్తవ పాటల కేసెట్లు

'సత్యవాణి' కార్యక్రమంలో రేడియోలోను, టి.వి.లోను మీరు వినుచున్న పాటలు ఇప్పుడు నాలుగు కేసెట్లలో లభించు చున్నవి. మొత్తము 55 పాత క్రొత్త పాటలు వీనుల విందుగా పాడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రికార్డు చేయబడినవి. దేవుని పాటలు పాడి మహిమ పరుచుటలో యివి సహాయపడును. 4 కేసెట్ల విలువ పోస్టేజీతో సహా 130/- రూ॥లు మాత్రమే. ఈ కేసెట్లు కావలసిన వారు వెంటనే దిగువ చిరునామాకు డబ్బు పంపి పొందవచ్చును.

SATYA VANI
7-9-35
Sambhamurthy St.
Kakinada - 533 004.

---

<u>గమనిక</u> : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATVA VANI, P.O. BOX-90, KAKINADA - 533 001.

## సంక్షిప్త వార్తలు

2004 జూన్ 5వ తేదీ శనివారం నాడు తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో సోదరులు టి.సి హెచ్. ఫ్లెమింగ్స్ గారి ఆధ్వర్యమున క్రీస్తు సంఘ సహోదరుల సహవాస కూటము జరిగెను. ఆ కూటమునకు పరిసర ప్రాంతముల నుండి పలు సువార్తికులు హాజరైరి. "క్రైస్తవులు పాతనిబంధన" అనే అంశము ఆరోజు చర్చింపబడెను. సోదరులు పి.సంజీవ రావు గారు అధ్యక్షులుగా నుండి కార్యక్రమమును చక్కగా నడిపించిరి. సోదరులు వి. యేసురత్నం (పిఠాపురం), ఎమ్ముల దేవదాసు (రౌతులపూడి), జాషువాగూటం (కాకినాడ), పి.సంజీవరావ్ (పాతపెద్దాపురం), టి.సి హెచ్.ఫ్లెమింగ్స్ (పెద్దాపురం) గార్లు పై అంశమును లేఖనములపై ఆధారపడి బోధించిరి. క్రైస్తవులు పాతనిబంధనను బట్టి గాక క్రొత్త నిబంధనను బట్టి నడుచు కొనవలెనని, పాతనిబంధన మనకు బోధ కలుగుటకు, బుద్ధి కలుగుటకు ఈయబడెనని ఉపదేశించిరి. సదస్సుకు హాజరైన వారందరికీ స్థానిక సంఘము, ఫ్లెమింగ్స్ గారు, వారి కుటుంబము చక్కటి ఆతిధ్యమిచ్చిరి. ఫ్లెమింగ్స్ గారు వందన సమర్పణ చేయగా, జాషువా గారి ప్రార్ధనతో సదస్సు ముగిసెను. తదనంతరము ఒక హైందవ స్త్రీ క్రీస్తులోనికి బాప్తిస్మము నొందెను.

సదస్సు ముగిసిన తదనంతరము పెద్దాపురం వ్యాపార వీధిలో హైందవుల మధ్య జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడకు హాజరైన వారందరు ప్రతి వారము కూడుకొని క్రీస్తును గూర్చి ఆయన సంఘమును గూర్చి ఎక్కువ తెలిసికొనుటకు నిశ్చయించుకొనిరి. వారికి సోదరులు వై. విజయ కుమార్ గారు సువార్త చాటు చున్నారు.

జూన్ 14, 15 తేదీలలో విశాఖ పట్టణం నందమూరి నగర్‌లోను, క్రొత్త గాజువాకలోను జరిగిన సువార్త కూటములలో జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. నందమూరి నగర్‌లో సోదరులు యమ్. జోసెఫ్‌రెడ్డి గారును, క్రొత్త గాజువాకలో సోదరులు జ్యోతి గారును వాక్యపరిచర్య చేయు చున్నారు. ఈ కూటములకు పరిసర ప్రాంతముల సువార్తికులు పలువురు హాజరైరి.

జూన్ 25వ తేదీ శుక్రవారం సాయంత్రం జగ్గంపేట నెహ్రూకోలనీలో నూతనంగా నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసిరి. వాక్యపరిచర్య చేసిరి. ఆ సభకు ఇరిపాకలో సువార్త పని చేయుచున్న సోదరులు మల్లవరపు జోసెఫ్‌గారు అధ్యక్షత వహించిరి. కూటము అనంతరం ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. జగ్గంపేట

నె|హ్రూకోలనీలోను, రామవరం గ్రామంలోను సోదరులు వై. విజయకుమార్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు. జూన్ 25వ తేదీ రాత్రి 8గంటలకు జగ్గంపేట గోపాలనగర్‌లో నూతనంగా నిర్మించబడిన ఆలయములో జరిగిన సువార్త కూటమునకు జాషువా గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. పలువురు స్థానికులు హాజరై ప్రభువును స్తుతించిరి.

జూన్ 26వ తేదీ శనివారం ఉదయం కాకినాడ, జగన్నాథపురం వాస్తవ్యులు సోదరులు టి. జ్ఞానానందం గారు ప్రభువు నందు నిద్రించిరి. ఆయన వయస్సు 97 సంవత్సరములు. మరునటి దినం సాయంత్రం జరిగిన సమాధి కార్యక్రమములో పలువురు బంధువులు, మిత్రులు, పట్టణ ప్రముఖులు హాజరైరి. జ్ఞానానందంగారు విడిచి వెళ్లిన కుమారుడు టి.వి.ఎస్. కుమార్ గారి కొరకు, తదితర కుటుంబ సభ్యుల కొరకు స్థానిక సంఘము కొరకు ప్రార్థించమనవి.

జూన్ 30వ తేదీ ఉదయం జగ్గంపేట మండలం ఇర్రిపాకలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయము ప్రతిష్ట చేయబడెను. ఇర్రిపాకలో సోదరులు మల్లవరపు జోసెఫ్ గారు సువార్త చాటు చున్నారు. ఆలయ ప్రతిష్ట అనంతరం 7గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు వై. విజయకుమార్ గారు అధ్యక్షత వహించిరి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:
**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001**

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.